ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5 అనంతపురం
జిల్లా వార్తలు
గురువారం 4 ఏప్రిల్ 2024




సప్తగిరి సర్కిల్లోని ఈద్గా మసీదులో పాచిపట్టిన నీటితొట్టె

అంతటా అంతే..

రామ్‌నగర్‌లోని క్రీసెంట్ స్కూల్ వెనుకవైపు ఉన్న మక్కా మసీదుకు రంగులు వేయలేదు. దీంతో గోడలన్నీ అపరిశుభ్రంగా మారాయి. డ్రైవర్స్ కాలనీలోని నూరానీ మజీదులో సమస్యలను ఎంత తక్కువ ప్రస్తావించుకుంటే అంత మంచిదన్న చందంగా మారింది. శ్మశానం, మసీదు ఒక్కటే కాంపౌండ్‌లో ఉన్న చోట మౌలిక వసతులు లేవు. మసీదులో నమాజ్ చేసుకునేందుకు ఏర్పాటు చేసిన షెడ్డు తుప్పుపట్టింది. ఈ షెడ్డుకు ఆనుకొని చెత్తాచెదారం పేరుకుపోయింది. వజూ చేసుకునే వాటర్ ట్యాంకుల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో బండలు నాటారు. అవీ విరిగిపోయాయి. మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. శ్మశానానికి, మసీదుకు మధ్యలో గోడ లేకపోవడంతో బండలు నాటారు. అవి ఒక పక్కకు ఒరిగిపోయాయి. చెత్తాచెదారంతో ఆ ప్రాంతం అపరిశుభ్రంగా మారింది. డ్రైవర్స్ కాలనీ ఈద్గా మైదానంలో దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. ఈద్గాలోని మినార్‌ల పైభాగం తుప్పుపట్టి ఒకపక్కకు ఒరిగిపోయింది. ప్రహరీలకు రంగులు వేయకపోవడంతో పెచ్చులూడిపోతున్నాయి. ప్రహరీలపై ప్రకటనలు వేయడంతో అధ్వాన్నంగా కనిపిస్తోంది.



డ్రైవర్స్ కాలనీ మసీదులో నిరుపయోగంగా మారిన మరుగుదొడ్లు

పట్టించుకునేదెవరు..?

జిల్లా కేంద్రంలోనే అధ్వాన పరిస్థితులుంటే.. ఇక మండల కేంద్రాలు, మారుమూల గ్రామాల్లో మసీదులు, ఈద్గాల గురించి పట్టించుకునేదెవరు..? ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో వాటి ఆలనాపాలనా కరువైంది. పగిలిన గోడలు, మరుగుదొడ్ల లేమితో మసీదులకొచ్చే ముస్లింలు ఇబ్బంది పడుతున్నారు. వక్ఫ్ బోర్డు, మైనార్టీ సంక్షేమశాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు.



శ్మశాన వాటిక, మసీదు మధ్య ఉన్న బండలు ఒరిగిన దృశ్యం



సప్తగిరి సర్కిల్లోని ఈద్గా మసీదులో పెచ్చులూడిన గోడ, పగిలిన రేకులు

5 ఏళ్ల వివక్ష..!

ముస్లింల సంక్షేమం పట్టని ప్రభుత్వం

ముస్లిం మైనార్టీల అభివృద్ధి, సంక్షేమాన్ని వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసింది. వైసీపీ అధికారంలోకి రాగానే మైనార్టీలకు లబ్ధి చేకూరే పథకాలను ఆపేశారు. అరకొర పథకాలకు నిబంధనలతో కొర్రీ వేశారు. పవిత్ర రంజాన్ మాసంలోనూ వారికి చేయూత కరువైంది. భక్తిశ్రద్ధలతో నెలంతా ఉపవాసాలు చేసే ఆ వర్గాల కోసం మసీదులు, ఈద్గాలలో మౌలిక వసతులను కల్పించలేదు. దెబ్బతిన్న స్లాబ్‌లు, పెచ్చులూడిన గోడలు, తుప్పుపట్టిన రేకుల షెడ్డులు, నీటి కొరత.. ఇలా అనేక సమస్యలు మసీదులు, ఈద్గాలలో నెలకొన్నాయి. - అనంతపురం ప్రెస్‌క్లబ్

- వైసీపీ పాలనలో పథకాలు దూరం
- ఈద్గాలు, మసీదులకు అందని నిధులు
- వసతుల లేమితో నమాజుకు ఇబ్బందులు
- టీడీపీ హయాంలో ఏటా రూ.50 లక్షలు
- రంజాన్ మాసంలో తోఫాతో చేయూత



ఈద్గాలోని మినార్‌పై తుప్పుపట్టి విరిగిన చాంద్

దెబ్బతిన్న గోడలు



కార్పెట్లు లేక టార్పాల్ పట్టలు వేసిన దృశ్యం

అనంతపురం నగరంలో పేరుగాంచిన మసీదులు, ఈద్గాలోనే తగిన వసతులను ప్రభుత్వం కల్పించ లేదు. సప్తగిరి సర్కిల్‌లోని ఈద్గాలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. మూడేళ్లుగా పెయింటింగ్ వేయకపోవడంతో గోడలు దెబ్బతి న్నాయి. మరికొన్ని చోట్ల స్లాబ్‌లు, గోడల పెచ్చులు ఊడిపోయాయి. నమాజ్ చేసుకునే పై అంతస్తులో రేకులు విరిగిపోయాయి. నమాజు చేసుకునేందుకు కూర్చునే చోట కార్పెట్లు లేవు. టార్పాలిన్ పట్టలతో నెట్టుకొస్తున్నారు. నీటి వసతి లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. రెండుమూడు రోజులకొకసారి వచ్చే నీటిని ఒక తొట్టెలోకి వదులుకొని వాటితోనే వజూ చేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. నీటి నిల్వ కారణంగా తొట్టె పాచిపట్టింది. మరుగుదొడ్ల పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది.

టీడీపీ హయాంలో...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 614 మసీదులు ఉన్నాయి. ఇవన్నీ వక్ఫ్‌బోర్డు కింద నడుస్తున్నాయి. తెలుగుదేశం హయాంలో ఏటా రంజాన్ మాసంలో మసీదులు, ఈద్గాల మరమ్మతులు, మౌలిక వసతులు తదితరాల కోసం నిధులు విడుదలయ్యేవి. రంజాన్ మాసంలో ఏటా రూ.50 లక్షల నుంచి రూ.70 లక్షల వరకూ నిధులు ఇచ్చేవారు. ఈ నిధులను దరఖాస్తు చేసుకున్న మసీదు, ఈద్గాల నిర్వాహకులకు వక్ఫ్‌బోర్డు, మైనార్టీ వెల్ఫేర్ అధికారులు సమస్యను బట్టి మంజూరు చేసేవారు. ఆ నిధులను మసీదులకు రంగులు వేసేందుకు, మౌలిక వసతుల కల్పనకు వాడేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్కరూపాయి కూడా విడుదల చేయలేదు. దీంతో మసీదులు, ఈద్గాల పరిస్థితి దారుణంగా తయారైంది.



డ్రైవర్స్ కాలనీలో ప్రహరీని ప్రకటనలతో నింపిన వైనం

తీరని అన్యాయం..

వైసీపీ ఐదేళ్ల పాలనలో ముస్లింలకు తీరని అన్యాయం జరిగింది. సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత రంజాన్ తోఫా ఇవ్వకుండా మోసం చేశారు. మసీదులు, ఈద్గాల మరమ్మతులకు నిధులివ్వలేదు. దీంతో అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. మౌజన్, ఇమామ్‌లకు గౌరవ వేతనాలు ఇవ్వడంలేదు. సబ్సిడీ రుణాలను ఎత్తేశారు. ముస్లింలపై దాడులు అధికమయ్యాయి. అధికార పార్టీ నేతల అరాచకాలకు తట్టుకోలేక ఎంతోమంది ముస్లింలు ఆత్మహత్య చేసుకున్నారు. ముస్లింల కోసం ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటు చేసి, వడ్డీలేని రుణాలు ఇస్తామని సీఎం హామీ ఇచ్చి మోసం చేశారు. నిబంధనలతో దుల్హన్ పథకాన్ని నిర్వీర్యం చేశారు. రోడ్డు విస్తరణ సమయంలో నీమా రెసిడెన్సీ బిల్డింగ్‌లు కొట్టకుండా.. ఆదాయం వచ్చే సప్తగిరి సర్కిల్‌లోని మసీదు కాంప్లెక్స్‌ను కూల్చేందుకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కుట్రలు చేశారు.



- సైఫుద్దీన్, టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి

వేడి వేడిగా పింఛన్లు..!

- మధ్యాహ్నం తరువాత పంపిణీ ప్రారంభం
- స్పష్టత లేక ఉదయమే వెళ్లిన లబ్ధిదారులు
- కొన్ని సచివాలయాల వద్ద వైసీపీ నాయకులు
- టీడీపీ అభ్యంతరం.. పంపించిన అధికారులు
- రాజకీయ లబ్ధికోసం అధికార పార్టీ ప్రయత్నం

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

పింఛన్ల పంపిణీ 'వేడి వేడి'గా మొదలైంది. ఎన్నికల కమిషన్ వలంటీర్లను దూరం పెట్టడంతో సచివాలయ సిబ్బంది ఈ బాధ్యతలను చేపట్టారు. ఎండల తీవ్రత కారణంగా ఇబ్బందులు తలెత్తకుండా కొన్నిచోట్ల షామియానాలు ఏర్పాటు చేశారు. తాగునీటిని అందుబాటులో ఉంచారు. ఎన్నిగంటలకు పంపిణీ మొదలౌతుందో స్పష్టమైన సమాచారం లేకపోవడంతో చాలాచోట్ల లబ్ధిదారులు ఉదయమే సచివాలయాల వద్దకు చేరుకున్నారు. పంపిణీ మధ్యాహ్నం తరువాత ఉంటుందని తెలియడంతో కొందరు వేచి చూశారు. మరికొందరు వెనుదిరిగారు. కొన్ని ప్రాంతాలలో ఉద్దేశపూర్వకంగా 'ఉదయమే వెళ్లండి..' అని లబ్ధిదారులకు వైసీపీ నాయకులు, వలంటీర్లు చెప్పి పంపించారు. ఈ అంశాన్ని ఎలాగైనా రాజకీయ లబ్ధికి వాడుకోవాలని వైసీపీ నాయకులు తీవ్రంగానే ప్రయత్నించారు. కానీ ఎన్నికల కమిషన్ దెబ్బకు జడిసి అధికారులు కాస్త అప్రమత్తంగానే వ్యవహరించారు.



యాడికిలో లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా కుర్చీలువేసి కూర్చోబెట్టిన అధికారులు, పింఛన్ అందజేస్తున్న ఎంపీడీఓ, సచివాలయ సిబ్బంది

అపోహలకు చెక్

యాడికి మండలంలో వైసీపీ నాయకులు సృష్టించిన అపోహలకు చెక్ పెడుతూ.. అధికారులు పింఛన్ల పంపిణీలో ఇబ్బందులు లేకుండా చూశారు. సచివాలయాల వద్ద కుర్చీలు, షామియానాలు ఏర్పాటు చేశారు. నడవలేని స్థితిలో ఉన్న వారికి ఇళ్లవద్దే పింఛన్లను అందజేస్తామని ఎంపీడీఓ సావిత్రి తెలిపారు.

సమాచార లోపం..

- యల్లనూరు మండలంలో బుధవారం ఉదయం ఏడు గంటలకే సచివాలయాల వద్దకు పింఛన్‌దారులు చేరుకుని వరుసలో కూర్చున్నారు. పింఛన్ల పంపిణీ ఎప్పుడు మొదలౌతుందో తెలియక పడిగాపులు కాశారు. తమకు ఇంకా పింఛన్ సొమ్ము అందలేదని సచివాలయ ఉద్యోగులు చెప్పడంతో ఒక్కొక్కరుగా వెనుదిరిగారు.
- అనంతపురం నగరంలోని పలు సచివాలయాలకు పింఛన్ కోసం లబ్ధిదారులు ఉదయమే వచ్చారు. మధ్యాహ్నం మూడు గంటల తరువాత పంపిణీ చేస్తామని సచివాలయ సిబ్బంది చెప్పడంతో వెనుదిరిగారు. సాయంత్రం నాలుగు గంటల తరువాత పంపిణీ మొదలైంది. కొన్నిచోట్ల సర్వర్ సమస్య రావడంతో ఇబ్బందులు తలెత్తాయి. వేలి ముద్రలు పడనివారికీ నిరాశ ఎదురైంది. అనంతపురం రూరల్, గార్లదిన్నె మండలంలోనూ ఇదే పరిస్థితి కనిపించింది.



నవోదయకాలనీ సచివాలయంలో భారీగా పింఛన్‌దారులు

- చెన్నేకొత్తపల్లి మండలంలో లబ్ధిదారులు ఉదయమే సచివాలయాల వద్దకు వచ్చారు. మధ్యాహ్నం 3 గంటల తరువాత పింఛన్ల పంపిణీ మొదలైంది. బ్యాంకులలో నగదు లేకపోవడంతో ఆలస్యమైందని ఎంపీడీఓ అన్నారు.

పెద్దారెడ్డి అసత్య ప్రచారం



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

సీఎం జగన్ మళ్లీ అధికారంలోకి వస్తేనే ఇంటి వద్దకు పింఛన్ అందుతుందని, లేదంటే అవస్థలు తప్పవని వైసీపీ తాడిపత్రి అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డి అసత్య ప్రచారం చేశారు. తాడిపత్రి పట్టణంలోని అంబేడ్కర్ నగర్, దళితవాడలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓ వృద్ధురాలిని పలకరిస్తూ, వైసీపీకి ఓటు వేయాలని లేకుంటే ఇంటి వద్దకు పింఛన్ రాదని అన్నారు. 'ఈ నెల పింఛన్ కోసం ఎన్ని అవస్థలు పడుతున్నారో చూడండి' అని అన్నారు. జగన్ రాకుంటే వచ్చేవి కూడా రాకపోవచ్చునని ఆయన బెదిరించే ప్రయత్నం చేశారు.

- శింగనమల నియోజకవర్గంలో పలువురు వలంటీర్లు ఉద్దేశపూర్వకంగా లబ్ధిదారులకు అసత్య సమాచారం ఇచ్చారు. పింఛన్లను బుధవారం సాయంత్రం నుంచి పంపిణీ చేస్తారని తెలిసినా.. ఉదయమే సచివాలయాల వద్దకు వెళ్లాలని సూచించారు. దీంతో పలువురు వృద్ధులు, దివ్యాంగులు పింఛన్ల కోసం ఉదయమే సచివాలయాల వద్దకు చేరుకుని ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నడవలేనివారికి ఇళ్లవద్దే పింఛన్ ఇస్తామని అధికారులు స్పష్టంగా చెబుతున్నా.. వలంటీర్లు ఈ అంశంలోనూ తప్పుదారి పట్టిస్తున్నారు. అందరూ సచివాలయాల వద్దకే వెళ్లాలని ప్రచారం చేస్తున్నారు.

వైసీపీ నాయకుల దర్జా

ఉరవకొండ 5వ సచివాలయంలో డ్రైవర్స్ కాలనీవారికి పింఛన్ పంపిణీ జరిగింది. వైసీపీ నాయకులు రామిరెడ్డి, బేల్దారు శర్మాష్, జోగి బీమన్న అక్కడికి వచ్చి దర్జాగా కుర్చీల్లో కూర్చున్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా పింఛన్ల పంపిణీ వద్ద ఎలా కూర్చుంటారని టీడీపీ నాయకులు ప్రశ్నించారు. దీంతో వైసీపీ నాయకులు వాగ్వాదానికి దిగారు. టీడీపీ ఫిర్యాదు చేయడంతో ఎంపీడీవో అక్కడికి వచ్చి వైసీపీ నాయకులను ప్రశ్నించారు. తాగునీటిని ఏర్పాటు చేసేందుకు వచ్చామని వారు సాకు చెప్పడంతో.. ఆ అవసరం మీకేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బందిపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులను పోలీసులు అక్కడ నుంచి పంపించారు.



పింఛన్ పంపిణీ ప్రాంగణంలో కుర్చీల్లో కూర్చున్న వైసీపీ నాయకులు

పంపిణీలో వలంటీర్

బ్రహ్మసముద్రం మండలం పాల వెంకటాపురం పంచాయతీ ఎర్రకొండాపురం గ్రామంలో పింఛన్లను ఓ వలంటీరు పంపిణీ చేశాడు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ, సచివాలయ ఉద్యోగులతో కలిసి వలంటీరు ఈ కార్యక్రమంలో పాల్గొనడం గమనార్హం.



ప్రలోభాలపై ఫిర్యాదు చేయండి

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 3: ఎన్నికల వేళ ఓటర్లను ప్రలోభపెడితే ఫొటోలను సి-విజిల్ యాప్‌లో అప్‌లోడ్ చేసి ఫిర్యాదు చేయాలని అర్బన్ తహసీల్దారు శివరామిరెడ్డి యువతకు సూచించారు. ఎస్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాలలో బుధవారం ఓటరు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాధ్యతాయుతమైన ప్రభుత్వాన్ని, సమర్థులైన నాయకులను ఎన్నుకోవడంలో యువత కీలక పాత్రపోషించాలని అన్నారు. ప్రతి విద్యార్థీ ఓటు గొప్పతనం గురించి పదిమందికి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి, ఎన్నికల అధికారులు పద్మావతి, జ్యోతి, ప్రసాద్, అచ్యుతానంద, ఎస్ఎస్ఎస్ అధికారులు విష్ణుప్రియ, సోమశేఖర్, రామకృష్ణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్	గురువారం సాయంత్రం	06:34
సెహరీ	శుక్రవారం ఉదయం	04:55

ఉష్ణోగ్రతలు (బుధ)
గరిష్ఠం : 42.0
కనిష్ఠం : 27.0

రాజకీయ పార్టీలు నిబంధనలు పాటించాలి

జిల్లా ఎన్నికల అధికారి కేతన్ గార్గ్



అనంతపురం టౌన్, ఏప్రిల్ 3: ప్రతి రాజకీయ పార్టీ తప్పనిసరిగా ఎన్నికల నిబంధనలు పాటించాల్సిందేనని జిల్లా ఎన్నికల అధికారి, ఇన్‌చార్జి కలెక్టరు కేతన్‌గార్గ్ అన్నారు. కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈనెల 16న సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్, 18న అసెంబ్లీ ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ విడుదల అవుతుందని అన్నారు. ఈ నెల 12 నుంచి 14 వరకు ఆటోమేటిక్ సాఫ్ట్‌వేర్ ద్వారా ఈవీఎంల రాండమైజేషన్ ప్రక్రియ చేపడుతున్నామని తెలిపారు. ఆ తర్వాత ఈవీఎంలను పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు పంపిస్తామని అన్నారు. ఈ నెల 14వ తేదీవరకు కొత్త ఓటరు నమోదు కోసం ఫారం-6 దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. రాజకీయ పార్టీలు తమ కార్యక్రమాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని, చివరి క్షణంలో అడిగినా అనుమతులు ఇస్తామని అన్నారు. వయసు 85 ఏళ్లు పైబడినవారికి హోం ఓటింగ్‌కు అవకాశం ఇస్తామని, పోలింగ్ కేంద్రాలకు రాలేని వారందరికీ ఈ విషయం తెలపాలని కోరారు. తాముకూడా అలాంటి ఓటర్లను గుర్తించేందుకు సర్వే చేపడుతున్నామని, ఎన్నికల కమిషన్ సూచనల మేరకు వారికి ఫారం-12డి అందిస్తామని తెలిపారు. రాజకీయ పార్టీలు అభ్యర్థుల నామినేషన్లకు అవసరమైన డాక్యుమెంట్లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. సువిధ పోర్టల్‌లో కూడా చివరి రోజువరకు నామినేషన్లు అందించవచ్చని తెలిపారు. అభ్యర్థులకు కులధ్రువీకరణ పత్రాలను వెంటనే జారీ చేయాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. సి-విజిల్ యాప్ ద్వారా తప్పుడు ఫిర్యాదులు చేసేవారిపై చర్యలు తీసుకోవాలని కొన్ని పార్టీల ప్రతినిధులు కోరారు. సమస్యాత్మక నియోజకవర్గాలైన రాప్తాడు, తాడిపత్రి, ఉరవకొండలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని పలువురు కోరారు. సమావేశంలో కలెక్టరేట్ ఎలెక్షన్ సెల్ సూపరింటెండెంట్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ వలలో వలంటీర్లు..!

కొనసాగుతున్న రాజీనామాలు

యాడికి, ధర్మవరం రూరల్: అధికార పార్టీవారు చెప్పిన మాటలను నమ్మి.. చాలామంది వలంటీర్లు రాజీనామా చేస్తున్నారు. 'మళ్లీ మనదే అధికారం. మిమ్మల్ని తిరిగి తీసుకుంటాం..' అని వైసీపీ నాయకులు వలంటీర్లను మభ్యపెడుతున్నారు. ఈ రెండు నెలలు తామే వేతనం ఇస్తామని ప్రలోభపెడుతున్నారు. కొందరిపై ఒత్తిడి తెచ్చి రాజీనామా చేయిస్తున్నారు. ఏ కారణంచేతైనా రాజీనామా చేసినవారిని తిరిగి అదే పోస్టుకు తీసుకునేందుకు వీలుకాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. రాజీనామాల కారణంగా వలంటీర్లు నష్టపోతారని విపక్షాలు సైతం చెబుతున్నాయి.

- కనగానపల్లి మండలం కేఎన్‌పాళ్యంలో బుధవారం పది మంది వలంటీర్లు రాజీనామా చేశారు. బెళుగుప్ప మండలం దుద్దేకుంటలో 12 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. బెళుగుప్పలో మరో 23 మంది రాజీనామా చేశారు. కాగా, టీడీపీ కారణంగానే ఇంటింటికి పింఛన్లు అందడం లేదని ప్రచారం చేయాలని వలంటీర్లకు ఎమ్మెల్యేలు మెసేజ్‌లు పంపుతున్నారు.



కేఎన్ పాళ్యంలో రాజీనామా కాపీలను చూపుతున్న వలంటీర్లు

- యాడికి మండంలో రాజీనామా చేసిన వలంటీర్లతో వైసీపీ తాడిపత్రి నియోజకవర్గ అభ్యర్థి పెద్దారెడ్డి బుధవారం సమావేశం నిర్వహించారు. యాడికిలోని తన కార్యాలయంలో, రాయలచెరువు శివాలయం వద్ద రాజీనామా చేసిన వలంటీర్లతో ఆయన సమావేశమయ్యారు. వేతనం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇబ్బంది లేకుండా చూస్తామని భరోసా ఇచ్చారని వలంటీర్లు చర్చించుకుంటున్నారు. ఈ సమావేశాలలో ఎవరూ ఫొటోలు తీయకుండా జాగ్రత్తపడ్డారు.

జగన్ ప్రభుత్వాన్ని ఓడించండి: సీపీఐ



మాట్లాడుతున్న జాఫర్

అనంతపురం విద్య, ఏప్రిల్ 3: రాష్ట్రంలో రైతులను ఆదుకోని జగన్ ప్రభుత్వాన్ని ఓడించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. జగన్ ప్రభుత్వంలో రైతులు సమస్యలతో ఆత్మహత్యలు చేసుకుంటున్నా.. ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. కరువు మండలాలుగా ప్రకటించినా రైతులకు ఎలాంటి సాయం అందించలేదన్నారు. రెండు రోజుల కిందట తాడిపత్రి, పెద్దవడుగూరు, కూడేరు తదితర మండలాలకు చెందిన రైతులు కరువు వల్ల ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరువు సాయం అందించాలని కోరిన వారిపై కూడా కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. వివేకా హత్యపై పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, డాక్టర్ సునీత జగన్‌ను ప్రశ్నిస్తున్నారని, వాటినీ జగన్ ఏ మాత్రం స్పందించడం లేదని, మొదట వారి ప్రశ్నలకు సమాధానం చెప్పిన తర్వాత ఆయన ప్రజలను ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నారాయణస్వామి, లింగమయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

వైకుంఠానికి టిక్కెట్ రాలేదని సొమ్మసిల్లిన నాయకుడు



శ్రీరాములును పరామర్శిస్తున్న ప్రభాకర్ చౌదరి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 3: మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వలేదన్న మనస్థాపంతో టీడీపీ నాయకుడు చాకలి శ్రీరాములు సొమ్మసిల్లిపడిపోయారు. కొన్ని రోజులుగా ఆయన ప్రభాకర్ చౌదరికి టికెట్ ఇవ్వాలని నిర్వహించే సమావేశాలకు హాజరవుతూ వస్తున్నారు. బుధవారం రాత్రి ప్రభాకర్ చౌదరి ఇంటి వద్దకు చేరుకొని ఆయనతో టికెట్ విషయంపై మాట్లాడుతుండగా ఉన్నట్లుండి సొమ్మసిల్లిపడిపోయారు. అక్కడే ఉన్న నాయకులు ఆయన్ను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైకుంఠం ఆయన్ను పరామర్శించారు.

కార్యకర్తలకు అండగా ఉంటా: జకీవుల్లా



కార్యకర్తలతో సమావేశమైన కేఎం జకీవుల్లా

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 3: తనను నమ్ముకున్న కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు కేఎం జకీవుల్లా పేర్కొన్నారు. బుధవారం అనంతపురం రూరల్ మండలం రాజీవ్ కాలనీలో స్థానిక నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎవరు పోటీ చేసినా తన కుటుంబం కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఏదైనా సమస్య వస్తే తన ఇంటి తలుపులు ఎప్పుడైనా తట్టవచ్చునని, ఇన్నాళ్లు తన వెంట నడిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చౌడయ్య, కృష్ణకుమార్, జిలాన్ బాషా, కేశవ రాయల్, లక్ష్మీనాయుడమ్మ, రమాదేవి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



అంబికా లక్ష్మీనారాయణతో రాజీవ్‌కాలనీ మహిళలు

అనంతపురంరూరల్, ఏప్రిల్ 3: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని తెలుగుదేశం పార్టీ అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని రాజీవ్ కాలనీ పంచాయతీ టీడీపీ కార్యాలయంలో స్థానిక నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ శ్రేణులంతా విభేదాలు పక్కనపెట్టి గెలుపు కోసం పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కన్వీనర్ అశోక్‌కుమార్, కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

బాబుతోనే యువతకు భవిష్యత్తు



యువతతో మాట్లాడుతున్న ముంటిమడుగు కేశవరెడ్డి

గార్లదిన్నె, ఏప్రిల్ 3: చంద్రబాబునాయుడుతోనే యువతకు భవిష్యత్ ఉంటుందని శింగనమల నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి అన్నారు. గార్లదిన్నె మండలం పాపినేపాళ్యం గ్రామానికి చెందిన పలువురు యువకులతో బుధవారం తన నివాసంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో శింగనమల నియోజకవర్గం అభ్యర్థి బండారు శ్రావణి శ్రీని గెలుపించుకుని చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గేటుక్రిష్టారెడ్డి, పుల్లన్న, రఘు, నారాయణస్వామి, నరేష్, ఎర్రిస్వామి, అంజి, రవి, సురేష్, సునిల్, సోము, రాము, రాజు పాల్గొన్నారు.

ఆస్పత్రి వద్ద మజ్జిగ పంపిణీ కేంద్రం

అనంతపురం టౌన్, ఏప్రిల్ 3: జిల్లా ఆస్పత్రి వద్ద ఎండాకాలంలో రోగులకు తమవంతు సాయం చేయాలని వెల్ఫేర్ గ్రూఫ్ ఫ్రెండ్స్ ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రం ఏర్పాటు చేశారు. బుధవారం ఈ కేంద్రాన్ని టుటౌన్ సీఐ క్రాంతి కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాజశేఖర్, హనుమంతప్ప, శ్రీరాములు, రాజు, సుందర్‌రాజు, మల్లికార్జున, లాయర్ నారాయణ, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

చీనీకాయలు టన్ను రూ.30 వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 3: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.30 వేలు, కనిష్ఠంగా రూ.14 వేలు, సరాసరి రూ.18,500తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 659 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఎస్కేయూలో సెమినార్

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 3: ఎస్కేయూలో ఇంగ్లీష్, తులనాత్మక సాహిత్య సెమినార్‌ను బుధవారం నిర్వహించారు. సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ... భాష, సంస్కృతి మానవ జీవనంలో అతర్భాగమని పేర్కొన్నారు. ఆంగ్లభాషపై పట్టుసాధించిన విద్యార్థులు అంతర్జాతీయంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డి, రిజిస్ట్రార్ లక్ష్మయ్య, ప్రిన్సిపాల్ క్రిష్ణకుమారి, కన్వీనర్ మాధవి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు హుస్సేన్‌వలి, షకిలా, పీహెచ్‌డీ స్కాలర్స్ రామకృష్ణ, ఉమాదేవి పాల్గొన్నారు.

జగన్ ఓటమే కూటమి లక్ష్యం

• మూడు పార్టీల నాయకులతో కలిసి ప్రచారం నిర్వహిస్తాం : టీడీపీ అనంత అర్బన్ అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 3: సీఎం జగన్‌ను గద్దెదించడమే కూటమి లక్ష్యమని అనంతపురం అర్బన్ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక శ్రీనగర్ కాలనీలో అనంత అర్బన్ టీడీపీ కార్యాలయం వద్ద అనంతపురం పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తనతోపాటు ఎంపీ అభ్యర్థి జిల్లా వాసులమేనన్నారు. రాప్తాడు ఎంపీపీగా నేషనల్ స్థాయిలో తాను ఉత్తమ అవార్డు పొందానన్నారు. అధికారంలోకి రాగానే అనంత అర్బన్‌ను దేశంలోనే ప్రథమ స్థాయిలో నిలుపుతానన్నారు. తమ టీడీపీ కుటుంబంలో చిన్న చిన్న సమస్యలున్నాయని, అందరినీ కలుపుకొని టీడీపీ విజయమే లక్ష్యంగా ముందుకు వెళతానని అన్నారు. అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు తీరని అన్యాయం చేశారన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు నాన్‌లోకల్ అంటూ కొందరు అసత్యప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు మాట్లాడుతూ... సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీకి తీరని అన్యాయం జరిగిందన్నారు. జనసేన రాయసీమ మహిళా విభాగం కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత మాట్లాడుతూ... ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఎక్కడా అభివృద్ధి చేసిన దాఖలాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ స్వరూప, అనంత అర్బన్ బ్యాంక్ చైర్మన్ జేఎల్ మురళీధర్, టీడీపీ రాష్ట్ర నాయకులు బుగ్గయ్యచౌదరి, గాజుల ఆదెన్న, కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాయల్ మురళీ, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దళవాయి వెంకట నారాయణ, బీసీ సెల్ నగర అధ్యక్షుడు సిమెంట్ పోలన్న, నాయకులు సుధాకర్‌నాయుడు, మాసినేని రామయ్య, లింగారెడ్డి, సంగా తేజస్విని, గుత్తా ధనుంజయనాయుడు, మారుతీ నాయుడు, వెంకటప్ప, బీజేపీ నాయకులు లలిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న కూటమి నేతలు

ఓటమి భయంతో వైసీపీ ప్రలోభాలు

మాజీ మంత్రి పరిటాల సునీత

అనంతపురం రూరల్, ఏప్రిల్ 3: ఓటమి భయంతో రాప్తాడు నియోజకవర్గంలో వైసీపీ నాయకులు ప్రలోభాలకు తెరలేపారని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగం గా మండలంలోని కొడిమి, ప్రజాచైతన్య కాలనీ, దర్గాకొట్టాల, జ్యోతి బసుకాలనీ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఏ రోజూ ప్రజల సమస్యలు పట్టించుకోకుండా ఎమ్మెల్యే సోదరులు, వారి వ్యాపారాలు సెటిల్మెంట్లలో మునిగిపోయారన్నారు. భూదందాలు, ఇసుక, ఎర్రమట్టి మాఫీయాతో చెలరేగిపోయారన్నారు. ప్రస్తుతం ఎన్నికల ఓటమి తప్పదన్న ఉద్దేశంతో అప్పుడే ప్రలోభాలకు తెరలేపారన్నారు. సుమారు రూ.రెండు కోట్ల విలువైన చీరలు కొనుగోలు చేశారని, వాటిని ఓటర్ల ఇళ్ల వద్దకు తీసుకొస్తారని అన్నారు. వాటిని తీసుకొని ఓటు మాత్రం సైకిల్ గుర్తుకే వేయాలని సూచించారు. ఏదో వంద రూపాల చీర ఇవ్వడం కాదని రూ.5వేల చీర ఇచ్చినా.. వారు చేసిన అక్రమ సంపాదనలో చాలా చిన్నదన్నారు.

టీడీపీలోకి చేరిక: స్థానిక మాజీ మంత్రి క్యాంపు కార్యాలయంలో పరిటాల సునీత, పరిటాల సిద్దార్థ ఆధ్వర్యంలో పలువురు వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరారు. అనంతపురంరూరల్ మండలం పాపంపేట పంచాయతీ బసవతారకనగర్, కనగానపల్లి మండలం కొండపల్లి ప్రాంతాల వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. అలాగే అనంతపురంరూరల్ మండలంలోని తాటిచెర్ల గ్రామానికి చెందిన 15 వైసీపీ కుటుంబాలు టీడీపీలోకి చేరాయి.

రామగిరి : రామగిరికి చెందిన వైసీపీ నాయకులు బుధవారం మాజీ మంత్రి పరిటాల సునీత సమక్షంలో టీడీపీలోకి చేరారు. అనంతపురం క్యాంపు కార్యాలయంలో పరిటాల సునీత బుధవారం వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి పరిటాల సునీత

ఇంటి వద్దే పింఛన్లు పంపిణీ చేయాలి: టీడీపీ





నార్పలలో ఎంపీడీఓకి, కందుకూరులో సచివాలయ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

నార్పల, ఏప్రిల్ 3: పింఛన్‌దారులకు ఇంటి వద్దే పింఛన్ల అందించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓకు టీడీపీ నాయకులు బుధవారం వినతి పత్రం అందజేశారు. పింఛన్లను సచివాలయ సిబ్బంది ద్వారా ఇళ్ల వద్దకే పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎర్రినాగప్ప, క్లస్టర్ ఇన్చార్జి పీఎల్ లక్ష్మీనారాయణ, యూనిట్ ఇన్చార్జి నాగభూషణం, కేసేపల్లి నాగేంద్ర, రాంభూపాల్‌రెడ్డి, రామానాయుడు, నాగేష్, వంశీ పాల్గొన్నారు.

అనంతపురం రూరల్ : పింఛన్లను ఇంటి వద్దనే పంపిణీ చేయాలని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కోరారు. ఆ మేరకు బుధవారం మండలంలోని కందుకూరు గ్రామంలో నాయకులు సచివాలయంలోని అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఓబిరెడ్డి, రామచంద్ర, పోతులయ్య, దాదులూరు, తిరుపాలు, పెద్దన్న, మల్లి, వెంకటరాముడు, చంద్రశేఖర్, నరేష్, ప్రవీణ్, క్రిష్ణ, అంజి, బాలాజీ, వరప్రసాద్ పాల్గొన్నారు.

హత్యకేసు నిందితుల అరెస్ట్

నార్పల, ఏప్రిల్ 3: స్థానిక రేణుక ఫర్టిలైజర్ యజమాని వీరభద్రుడు హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ వెంకటశివారెడ్డి బుధవారం తెలిపిన వివరాల మేరకు.. నార్పల మెయిన్ రోడ్‌లో సోమవారం వీరభద్రుడుని వేట కొడవళ్లతో నరికి హత్య చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. నార్పలలోనే మరో ఫర్టిలైజర్ షాపు నిర్వహిస్తున్న రఘుపతి, మరో బాల నేరస్తుడితో కలసి ఈ హత్య చేసినట్లు గుర్తించారు. వీరభద్రుడు, రఘుతో కలసి మొదట ఫర్టిలైజర్ షాపు పెట్టుకున్నారు. ఆర్థిక లావాదేవీలతో ఇద్దరి మధ్య గొడవలు ప్రారంభమాయ్యయి. దీంతో ఇద్దరు విడిపోయి వేరు వేరు ఫర్టిలైజర్స్ షాపులు పెట్టుకున్నారు. తాను అప్పుల పాలు కావడానికి, తన సంసారంలో గొడవలు రావడానికి వీరభద్రుడే కారణమని రఘు అతనిపై కక్ష పెంచుకు న్నాడు. ఒకటో తేదీన తన షాపులో పనిచేస్తున్న ఒక బాలనేరస్తుడితో కలసి ఈ హత్య చేసి పారిపోయారు. బుధవారం ఉదయం నాయనపల్లి క్రాస్‌లో ఉన్న వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రెండు వేటకొడవళ్లు, ఒక బుల్లెట్ మోటార్ వాహనం స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసిన సీఐ శ్రీధర్, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. రక్షణ కల్పించండి. రఘు బంధువులు, అతని కుటుంబ సభ్యుల నుంచి తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని వీరభద్రుడు భార్య రేణుక సీఐ శ్రీధర్, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి వద్ద వాపోయారు. ఎటువంటి బెది రింపులు వచ్చిన వెంటనే వెంటనే తమకు తెలియజేయాలని, పూర్తి స్థాయిలో రక్షణ కల్పిస్తామని సీఐ, ఎస్ఐ వారికి భరోసా కల్పించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వైద్యుల నిర్లక్ష్యం వల్లే చనిపోయాడని బంధువుల ఆందోళన

అనంతపురం టౌన్, ఏప్రిల్ 3: రోడ్డు ప్రమాదానికి గురై జిల్లా సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ మరణించాడు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే అతను మరణించాడని బాధిత కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. స్థానిక చంద్రబాబునాయుడు కొట్టాల కాలనీలో నివాసముంటున్న హనుమేష్ (32) ఆటో డ్రైవర్. అతనికి భార్య పూజిత, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. మంగళవారం మధ్యాహ్నం బుక్కరాయసముద్రం నుంచి వస్తుండగా అతని ఆటో బోల్తాపడింది. గాయపడ్డ హనుమేష్‌ను జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు సీటీ స్కానింగ్ చేయించి.. సమస్య ఏమీ లేదని రాత్రి డిశ్చార్జ్ చేశారు. బుధవారం ఉదయం హనుమేష్ మళ్లీ ఇబ్బంది పడుతుండగా... తిరిగి జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఇక్కడకు వచ్చిన అరగంటకు హనుమేష్ చనిపోయాడు. సమస్య ఏమీ లేదని చెప్పడం వల్లే తాము హనుమేష్‌ను ఇంటికి తీసుకెళ్లామని, తిరిగి ఆస్పత్రికి వస్తే వైద్యులు ఏ మాత్రం పట్టించుకోలేదని, వారి నిర్లక్ష్యం వల్లే అతను చనిపోయాడని హనుమేష్ కుటుంబ సభ్యులు, బంధువులు మండిపడ్డారు. దెబ్బలకు కట్టుకట్టినందుకు రూ. 500 వసూలు చేశారని ఆరోపించారు. వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మూడు నెలల హనుమేష్ పాపను చూపిస్తూ ఇక దీనికి దిక్కెవరంటూ పూజిత, ఆమె కుటుంబసభ్యులు ఏడవడం అందరినీ కలిచివేసింది. డీఎస్పీ వీరరాఘవరెడ్డి, సీఐ క్రాంతికుమార్ తమ సిబ్బందితో ఆస్పత్రికి చేరుకొని బాధితులతో మాట్లాడారు. కట్టుకట్టినందుకు సిబ్బంది రూ 500 తీసుకున్నట్లు రుజువు కావడంతో వెంటనే ఎంఎన్‌ఓ మురళీని సస్పెండ్ చేశామని సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. మృతిపై విచారణకు వైద్యులు శ్రీనివాసులు, ఆత్మారాం, ఆర్ఎంఓ పద్మజను నియమించామని, విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటామన్నారు.





హనుమేష్ మృతదేహం, పాపను చూపిస్తూ విలపిస్తున్న కుటుంబ సభ్యులు

ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 3 : రంజాన్ మాసాన్ని పురష్కరించుకుని ఆదరణ సేవా సమాజ్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఆజాద్‌నగర్‌లోని ఆ ట్రస్టు కార్యాలయం వద్ద దాదాపు 200 కుటుంబాలకు ట్రస్టు సభ్యులు షేక్ వలి బాషా, ముంతాజ్ తోఫాను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు తాడిమర్రి లాల్‌బాషా, కార్యదర్శి ఫక్రుద్దీన్, కోశాధికారి షకీలుద్దీన్, జిలాన్ పాల్గొన్నారు.

గ్రామాల్లో టీడీపీ విస్తృత ప్రచారం



దాదులూరులో ప్రచారంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 3: కనగానపల్లి మండలంలోని దాదులూరు, దాదులూరుకొట్టాల గ్రామాల్లో టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, కన్వీనర్ యాతం పోతలయ్య, ఎంపీటీసీ బిల్లే భాస్కర్, ముకుందనాయుడు, కేశవయ్య, లింగమయ్య, మల్లేష్, పోషణ, రాములమ్మ, బిల్లేరాజేంద్ర, సంజీవు, వెంకటేష్ పాల్గొన్నారు.

రాప్తాడు : రాప్తాడు మండలంలోని గాండ్లపర్తిలో మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళీ, కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

నేడు పరిటాల సునీత ప్రచారం : మండలంలోని అయ్యావారిపల్లి, ప్రసన్నాయపల్లి, చిన్మయ్‌నగర్‌లో గురువారం మాజీ మంత్రి పరిటాల సునీత ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు అయ్యవారిపల్లి గ్రామంలో ప్రచారం ప్రారంభమవుతుందన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.



గాండ్లపర్తిలో టీడీపీ నాయకుల ప్రచారం

టీడీపీలో చేరిన వైసీపీ నేతలు



బండారు శ్రావణిశ్రీ ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

శింగనమల ఏప్రిల్ 3: మండలంలోని నాయనవారిపల్లి గ్రామంలో నాయనవారిపల్లి గ్రామానికి చెందిన 13 వైసీపీ కుటుంబాలు టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ సమక్షంలో టీడీపీలో చేరాయి.



పరిటాల సిద్దార్థ ఆధ్వర్యంలో టీడీపీలో చేరుతున్న కొండపల్లి వాసులు

ధర్మవరంరూరల్ : కనగానపల్లి మండలం కొండపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరారు. అనంతపురంలోని పరిటాల సునీత నివాసంలో ఆమె తనయుడు పరిటాల సిద్ధార్థ సమక్షంలో వారు టీడీపీలో చేరారు.



ఆత్మకూరులో టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు

ఆత్మకూరు: గొరిదిండ్ల గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

ఈవీఎంల ర్యాండమైజేషన్ పకడ్బందీగా నిర్వహించాలి

అనంతపురం టౌన్, ఏప్రిల్ 3: ఎన్నికలకు వినియోగించే ఈవీఎంల రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు ఇన్‌చార్జ్ కలెక్టరు కేతన్‌గార్గ్ ఆదేశించారు. స్థానిక పాత ఆర్డీఓ కార్యాలయం ఆవరణంలోని గోదాంలో ఉన్న ఈవీఎంలను బుధవారం పరిశీలించిన ఆయన మాట్లాడారు. ఈవీఎంల పనితీరుపై రెండో విడత పరిశీలనకు సంబందించి ర్యాండమైజేషన్ ప్రక్రియ ఈనెల 12 నుంచి చేపడుతున్నామన్నారు. ఇందుకు పక్కాగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఈవీఎంలను బట్టి ర్యాండమైజేషన్‌కు ఎన్ని టేబుల్స్, కౌంటర్లు అవసరమో ఆ మేరకు తగిన జాగ్రత్తలతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. ర్యాండమైజేషన్ ముగిసే వరకు పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని పోలీస్‌శాఖకు ఆదేశించారు. ఆయన వెంట నగరపాలక కమిషనర్ మేగస్వరూప్, డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి, ఆర్డీఓ వెంకటేష్, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ రవికుమార్, తహసీల్దార్ శివరామిరెడ్డి పాల్గొన్నారు.

వివాహానికి ఆర్థిక సాయం

గార్లదిన్నె, ఏప్రిల్ 3 : మండలంలోని పెనకచెర్ల గ్రామానికి చెందిన బోయ అంజినేయులు కుమారుడు అంజి వివాహానికి శింగనమల నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి బుధవారం రూ. 10వేలు ఆర్థిక సాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గేటుక్రిష్టారెడ్డి, పుల్లన్న, పురుషోత్తం పాల్గొన్నారు.

మామిడి చెట్లకు నిప్పు

నార్పల, ఏప్రిల్ 3: మండలంలోని కురుగానిపల్లిలో బుధవారం రైతు సంజీవరెడ్డికి చెందిన మామిడి తోటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పలు చెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఐదేళ్ల మామిడి చెట్లు, డ్రిప్పు పరికరాలు పూర్తిగా దగ్ధమయ్యాయని, సుమారు రూ.5లక్షల పంట నష్టం వాటిల్లిందని బాధిత రైతు సంజీవరెడ్డి వాపోయాడు. రెవెన్యూ అధికారులు దగ్ధమైన మామిడి చెట్లను పరిశీలించి నష్టాన్ని ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.



దగ్ధమైన మామిడి చెట్లు

కరువు కాటు..!

బోరుబావుల్లో పడిపోయిన నీటిమట్టం


- పంటకు నీరివ్వలేకపోతున్న రైతులు
- నిలువునా ఎండుతున్న చీనీచెట్లు
- చేసేదిలేక కొట్టేస్తున్న వైనం
- అన్నదాతకు అప్పుల పంట

చీనీ చెట్లను బతికించుకోవడం కష్టంగా ఉంది



మా తోటలో చీనీచెట్లు నిలువునా ఎండిపోతున్నాయి. 400 చెట్లు ఉండగా ఇప్పటికే 60 చనిపోయాయి. ఇంకో నెలరోజులు పోతే ఎండ తీవ్రత, తెగుళ్ల బెడదకు ఎన్ని చెట్లు చనిపోతాయోనని భయంగా ఉంది.

- రామచంద్రారెడ్డి, రైతు



ఎండిన చీనీచెట్టు



తొలగించిన చీనీ చెట్లు

చీనీ పంటను కరువు కాటేస్తోంది. తీవ్ర వర్షాభావంతో బోరుబావుల్లో నీటిమట్టం దారుణంగా పడిపోయింది. పంటకు తడులివ్వలేని దుస్థితి దాపురించింది. దీంతో చెట్లు నిలువునా ఎండిపోతున్నాయి. లక్షల పెట్టుబడులు పోసి కాపాడుకున్న చెట్లు ఎండిపోతుంటే అన్నదాత కంట తడి పెడుతున్నాడు. వాటిని కాపాడుకునేందుకు అన్ని ప్రయత్నాలూ చేసినా ఫలించలేదు. చేసేదిలేక పెంచుకున్న చెట్లను నిలువునా నరికేస్తున్నాడు. అప్పులు మూటగట్టుకుంటున్నాడు. చెట్లు పెద్దవయ్యాయి, ఇక పంట పెట్టుకోవచ్చనీ, వచ్చిన దిగుబడిని విక్రయించి, అప్పులు తీర్చుకోవచ్చని ఆశపడిన చీనీ రైతుకు నిరాశే ఎదురవుతోంది. వేసవి ప్రారంభంలో ఒకవైపు నీటి ఎద్దడి.. మరోవైపు తెగుళ్ల దాడితో చీనీ చెట్లు ఎండిపోతున్నాయి. రైతులు ఎన్ని రకాల మందులు ఉపయోగించినా తెగుళ్లు అదుపులోకి రావడంలేదు. దీంతో చెట్లను తొలగించుకోవడమే శరణ్యమని రైతులు తొలగించే పనికి పూనుకుంటున్నారు. - తాడిమర్రి

అప్పుడలా.. ఇప్పుడిలా..

తాడిమర్రి మండలంలో వందల ఎకరాల్లో చీనీ సాగు చేస్తున్నారు. 2022లో వరుస భారీ వర్షాలు కురిశాయి. పీఏబీఆర్ కుడికాలువకు నీరు సమృద్ధిగా వదిలారు. దాదాపు మండలంలోని చెరువులన్నింటికీ నీరు చేరింది. 2023లో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నా.. భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండడంతో రైతులు పండ్లతోటలకు నీరు అవసరానికి మించి పెట్టుకున్నారు. అదే ఇప్పుడు వారికి ఇబ్బందులు తెచ్చిపెట్టింది. గత 8 నెలల్లో వాన జాడలేకపోవడం, పీఏబీఆర్ కుడి కాలువకు నీరు రాకపోవడంతో బోరుబావుల్లో భూగర్భజల మట్టాలు దారుణంగా పడిపోయాయి. దీంతో రైతులు.. పంటలకు అవసరమైన నీరు అందించలేకపోతున్నారు. గడచిన రెండేళ్లలో పంటలకు నీరు అధికంగా పెట్టడం, ఈసారి అరకొరగా ఇవ్వడంతో చీనీ చెట్లు దెబ్బతింటున్నాయి. ఎండిపోతున్నాయి. పక్క రైతుల నుంచి నీరు తీసుకునే అవకాశం కూడా లేదు. దీంతో చేసేదిలేక చీనీ చెట్లను తొలగిస్తున్నారు. పంట చేతికి వస్తుందనుకున్న తరుణంలో చెట్లు కొట్టేసుకోవాల్సి రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

నీరులేక 500 చెట్లు కొట్టేశా

ఈఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. బోరుబావిలో నీటిమట్టం పడిపోయింది. చీనీ పంటకు తడులిచ్చుకునేందుకు కూడా నీరు చాలట్లేదు. దీంతో చెట్లు ఎండిపోయాయి. చేసేదిలేక 500 చెట్లను తొలగించా. పంట చేతికొచ్చే సమయంలో 8 సంవత్సరాల వయసుగల చెట్లను కొట్టేయడంతో రూ.6 లక్షల వరకు నష్టపోయా.

- పక్కీర్‌రెడ్డి, రైతు, శివంపల్లి



నిలకడగా చింతపండు ధరలు

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 3: పట్టణంలోని మార్కెట్‌యార్డులో చింతపండు ధరలు నిలకడగా ఉన్నట్లు మార్కెట్‌యార్డు కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం గుమ్మఘట్ట, డీ.హీరేహాళ్, రాయదుర్గం ప్రాంతాల నుంచి చింతపండును మార్కెట్‌యార్డుకు తరలించారు. చపాతిరకం క్వింటాల్ రూ. 4500 నుంచి రూ. 7700 వరకు ధర పలకగా, కరిపులి రకం రూ. 10,200 నుంచి రూ. 15వేల వరకు పలికినట్లు తెలిపారు. మార్కెట్‌యార్డులో సేకరించిన చింతపండును హిందూపురం, గుంటూరు, తాడిపత్రి తదితర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిపారు.

అనంతపురం మీదుగా సింగిల్ ట్రిప్ ప్రత్యేక రైలు

గుంతకల్లు, ఏప్రిల్ 3: ప్రయాణికుల రద్దీని నియంత్రించడానికి ముజఫ్ఫర్‌నగర్-యశ్వంతపూర్ మధ్య (వయా అనంతపురం) వన్‌వే సింగిల్ ట్రిప్ ప్రత్యేక రైలును (నెం. 05269) నడపనున్నట్లు రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రైలు ముజఫ్ఫర్‌నగర్‌లో 4వ తేదీ మధ్యాహ్నం మూడున్నరకు బయలుదేరి 6వ తేదీ సాయంత్రం ఏడు గంటలకు యశ్వంతపూర్‌కు చేరుకుంటుందన్నారు. ఈ రైలు హాజీపూర్, పాటలీపుత్ర, బక్సర్, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ స్టేషన్, ప్రయాగంరాజ్ చౌకీ, మాణిక్‌పూర్, సట్నా, కట్ని, జబల్‌పూర్, నర్సింగ్‌పూర్, పిప్రియా, ఇటార్సి, నాగపూర్, బాలార్షా, సిర్పూర్ కాగజ్‌నగర్, రామగుండం, ఖాజీపేట్, కాచిగూడ, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, గద్వాల, కర్నూల్ సిటీ, డోన్, గుత్తి, అనంతపురం, ధర్మవరం స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

బీటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 3: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించి బీటెక్ పరీక్షా ఫలితాలు విడుదల చేశామని డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ కేశవరెడ్డి, సీఈ చంద్రమోహన్‌రెడ్డి బుధవారం తెలిపారు. జనవరి, ఫిబ్రవరిలో బీటెక్ ప్రథమ సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్ 23) రెగ్యులర్ పరీక్షలు నిర్వహించామన్నారు. అదేవిధంగా ప్రథమ, ద్వితీయ సెమిస్టర్స్ (ఆర్ 20, 21, 15) సప్లమెంటరీతో పాటు (ఆర్ 15) సప్లమెంటరీ లాస్ట్‌ఛాన్స్ పరీక్షలనూ నిర్వహించామన్నారు. మరోవైపు ఎంఫార్మసీ ప్రథమ సెమిస్టర్ (ఆర్ 21) రెగ్యులర్, సప్లమెంటరీతో పాటు (ఆర్ 17) సప్లమెంటరీ, ద్వితీయ సెమిస్టర్ (ఆర్ 21, 17) సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించామన్నారు. విద్యార్థులు వారి ఫలితాల కోసం www.jntua.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

గుంతకల్లు టౌన్, ఏప్రిల్ 3: పట్టణంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో పీఈటీ కొట్టినందుకు అవమానంగా భావించిన విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించింది. కర్నూలు జిల్లా మద్దికెర మండలం అగ్రహారం గ్రామానికి చెందిన ఓ బాలిక కేజీబీవీలో 8వ తరగతి చదువుతోంది. స్నాక్స్, చిల్లర డబ్బులు కాజేస్తోందని గత నెల 24న సహ విద్యార్థినులు ఆమెపై పీఈటీ అనితకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ విద్యార్థినిని పీఈటీ కొట్టి, మందలించారు. విషయం తెలుసుకున్న విద్యార్థిని తండ్రి బుధవారం ఉదయం కేజీబీవీకి వెళ్లి, ఇన్‌చార్జి ఎస్ఓ కాంచన గంగకు ఫిర్యాదు చేశారు. పిల్లలు తప్పు చేస్తే మందలించాలని, కొడితే ఎలా అని ప్రశ్నించారు. ఈ పరిణామాల నేపథ్యంలో మధ్యాహ్న భోజన సమయంలో తరగతి గదిలో చున్నీతో ఉరివేసుకునేందుకు ప్రయత్నిస్తూ, విద్యార్థిని కిందపడి కేకలు వేసింది. గమనించిన ఉపాధ్యాయులు ఆమెను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి మహేశ్వరి, ఎంఈఓలు మస్తాన్‌రావు, సుబ్బరాయుడు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి విద్యార్థినిని పరామర్శించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. పీఈటీ అనితను తాత్కాలికంగా విధుల నుంచి తొలగిస్తున్నామని కేజీబీవీ జిల్లా కార్యదర్శి తెలిపారు. కేజీబీవీకి వెళ్లి విచారించి, ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

బ్యాంకు మేనేజర్‌ను దుర్భాషలాడిన వ్యక్తికి జైలుశిక్ష

బుక్కపట్నం, ఏప్రిల్ 3: మండలకేంద్రంలోని భారతీయస్టేట్ బ్యాంకు మేనేజర్‌ను అసభ్యపదజాలంతో దుర్భాషలాడిన కేసులో మండలంలోని గూనిపల్లికి చెందిన కేశవరెడ్డికి ఆరునెలలు జైలుశిక్ష, రూ.10వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు. స్టేట్‌బ్యాంకు మేనేజర్ శ్రీహరికుమార్‌పై 2012 సెప్టెంబరు నెలలో క్రాప్‌లోన్ నిమిత్తం రైతు కేశవరెడ్డి బ్యాంకులో మేనేజర్‌ను చాంబర్‌లోకి వెళ్లి అసభ్యపదజాలంతో దూషించాడు. ఇందుకు బ్యాంకు మేనేజర్ సదరు వ్యక్తిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. అప్పటి ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో పుట్టపర్తి న్యాయాధికారి రాకేష్ ఐదుగురు సాక్షులను విచారించారు. తర్వాత పబ్లిక్‌ప్రాసిక్యూటర్ నగేష్ వాదనలతో ఏకీభవించి కేశవరెడ్డికి బుధవారం ఆరునెలలు జైలుశిక్ష, రూ.10వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

చిరుత మృతి

పెద్దవడుగూరు, ఏప్రిల్ 3: మండలంలోని భీమునిపల్లి గ్రామ సమీపంలో ఉన్న కొక్కిరాయి కొండలో బుధవారం అనారోగ్యంతో చిరుత మృతిచెందింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. పశువైద్యాధికారిణి కమల మృతిచెందిన చిరుతకు పంచనామా నిర్వహించారు. అనారోగ్యంతోనే చిరుత మృతి చెందిందని ధ్రువీకరించారు. నిబంధనల మేరకు చిరుతను ఖననం చేశారు.



మృతిచెందిన చిరుత

చెలగాటం..!

- డీఎస్సీ అభ్యర్థులతో వైసీపీ ప్రభుత్వం ఆటలు
- పరీక్షాకేంద్రాల ఎంపికకు ప్రారంభంకాని వెబ్‌సైట్ ఆప్షన్
- డౌన్‌లోడ్ కాని హాల్‌టిక్కెట్లు
- ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న అభ్యర్థులు

ధర్మవరం, ఏప్రిల్ 3: డీఎస్సీ అభ్యర్థులతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోంది. ప్రభుత్వ కొలువు సాధించాలన్న తపనతో డీఎస్సీ అభ్యర్థులు రాత్రింబవళ్లు చదివి టెట్ (టీచర్స్ ఎంట్రెన్స్ టెస్టు) సైతం రాసి డీఎస్సీకి అర్హత సాధించారు. డీఎస్సీ పరీక్షల నిర్వహణపై ప్రభుత్వం ఇప్పటివరకు సరైన సమాచారం తెలపకపోవడంతో అభ్యర్థులు మండిపడుతున్నారు. మరికొంతమంది అభ్యర్థులు తమ జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని విమర్శిస్తున్నారు. గతనెల 25వతేదీ నుంచి హాల్‌టిక్కెట్ల డౌన్‌లోడ్ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉంది. ఇంతవరకు ఆ వెబ్‌సైట్ ఆప్షన్ ఇవ్వలేదు. పరీక్షా కేంద్రాల ఎంపికకు కూడా ఇదే సమస్య నెలకొంది. దీంతో టీఎస్సీ అభ్యర్థులు అయోమయంలో పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ఇవ్వని డీఎస్సీని ఎన్నికల ముందు తక్కువ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. తీరా ఎన్నికల కోడ్ అమలవుతుందన్న సమయంలో హడావుడిగా టెట్ నిర్వహించింది. డీఎస్సీ నిర్వహణపై ప్రకటన చేయకముందే ఎన్నికల షెడ్యూల్ వచ్చింది. దీంతో అభ్యర్థులు డీఎస్సీ నిర్వహిస్తారా.. లేదా.. అన్న సందేహంలో కొట్టుమిట్టాడుతున్నారు.

పాపం.. అభ్యర్థులు..

బీఈడీ అభ్యర్థులు స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం నోటిఫికేషన్‌లో కల్పించింది. దీంతో బీఈడీ అభ్యర్థులు రెండు పోస్టులకు కొంతమంది దరఖాస్తు చేసుకోగా.. మరికొంతమంది ఎస్జీటీ పోస్టుకే చేసుకున్నారు. బీఈడీ అభ్యర్థులకు ఎస్జీటీ పోస్టులకు అర్హత కల్పించడంపై కొందరు కోర్టును ఆశ్రయించారు. ఎస్జీటీలకు అనుకూలంగా తీర్పు వెలువడింది. దీంతో ఎస్జీటీ పోస్టుకు మాత్రమే దరఖాస్తు చేసుకున్న బీఈడీ అభ్యర్థులు డీఎస్సీ పరీక్ష రాసే అవకాశం కోల్పోయారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల కారణంగా తాము డీఎస్సీని కోల్పోయామని పలువురు అభ్యర్థులు.. ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఎస్జీటీకి అర్హత లేని బీఈడీ అభ్యర్థులు స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు దరఖాస్తుచేసుకోవాలనుకున్నా.. గడువు ముగిసింది. ఎస్జీటీ పోస్టుకు చెల్లించిన దరఖాస్తు రుసుం రూ.750 బీఈడీ అభ్యర్థులకు ప్రభుత్వం నేటికీ తిరిగి చెల్లించలేదు.

30లోగా డీఎస్సీ నిర్వహించేరా?

హైకోర్టు ఆదేశాలతో విద్యాశాఖ సవరించిన షెడ్యూల్ ప్రకారం మార్చి 30 నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు డీఎస్సీ పరీక్షలు జరగాల్సి ఉంది. ఇప్పటివరకు అభ్యర్థుల పరీక్షా కేంద్రాల ఎంపికకు వెబ్‌సైట్ ఆప్షన్ కూడా ప్రభుత్వం ఇవ్వలేదు. మార్చి 25లోగా హాల్‌టిక్కెట్ డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉందని ప్రభుత్వం ప్రకటన కూడా చేసింది. 25 దాటినా ఇప్పటి వరకు హాల్‌టిక్కెట్ డౌన్‌లోడ్ చేసుకునే ఆప్షన్ ఇప్పటివరకు విద్యాశాఖ ఇవ్వలేదు. ముందుగా పరీక్షాకేంద్రాల ఎంపిక ప్రక్రియకే వెబ్‌సైట్ ఇవ్వలేదు. దీనిని బట్టి చూస్తే ప్రభుత్వం ఎన్నికల్లో అభ్యర్థుల ఓట్లు పొందడానికే ఇలాంటి జిమ్మిక్కులు ప్రదర్శించిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తమ జీవితాలతో ఆడుకుంటున్న ఈ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెబుతామని డీఎస్సీ అభ్యర్థులు చర్చించుకుంటున్నట్లు తెలుస్తోంది.

నిరుద్యోగులకు దగా



నిరుద్యోగులను ప్రభుత్వం దగా చేసింది. ఎన్నికలకు ముందు ఏటా జాబ్‌క్యాలెండర్ విడుదల చేసి, ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికింది. ఐదేళ్లు విడుదల చేయలేదు కానీ తీరా ఎన్నికల ముందు డీఎస్సీ నోటిఫికేషన్‌ను తక్కువ పోస్టులతో ఇచ్చింది. అది కూడా ప్రస్తుతం ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా వేశారు. దీంతో అభ్యర్థులు ఆయోమయంలో పడిపోయారు.

- బాలచంద్ర, డీఎస్సీ అభ్యర్థి, ధర్మవరం

ప్రభుత్వం చెలగాటం



ఎన్నికల ముందు నోటిఫికేషన్ విడుదల చేయడంలో అంతర్యమేమిటో అంతుచిక్కట్లేదు. డీఎస్సీ నోటిఫికేషన్ వదిలేసి, ఇప్పటివరకు వారికి హాల్‌టిక్కెట్, పరీక్షాకేంద్రాల ఎంపికకు వెబ్‌సైట్ ఆప్షన్ ఇవ్వలేదు. ఇది ఎన్నికల ముందు నిరుద్యోగులను మోసం చేయడమే.

- శివ, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి

సత్యకుమార్‌ను కలిసిన జయరాంనాయుడు

అనంతపురం టౌన్, ఏప్రిల్ 3: మీ కోసం మా సేవలు వ్యవస్థాపకుడు కే. జయరాంనాయుడు ధర్మవరం ఉమ్మడి కూటమి అభ్యర్థి, బీజేపీ నేత సత్య కుమార్‌ను కలిశారు. బుధవారం అనంతపురంలో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం జయరాం నాయుడుతో సత్యకుమార్ కొద్ది సేపు ఏకాంతంగా మాట్లాడారు. రాజకీయ పరిణామాలు, ఎన్నికలలో విజయం తదితర వాటిపై చర్చించారు.



సత్యకుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జయరాంనాయుడు

వైసీపీ ప్రచారంలో గాండ్లపర్తి ఫీల్డ్ అసిస్టెంట్

రాప్తాడు, ఏప్రిల్ 3: ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఉల్లంఘిస్తూ గాండ్లపర్తి ఫీల్డ్ అసిస్టెంట్ డొక్కా శంకర్ వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడు. మంగళవారం రాత్రి గాండ్లపర్తిలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆ ఫీల్డ్ అసిస్టెంట్ ప్రచార రథం ఎక్కి మరీ ప్రచారం చేశాడు.



ప్రచారం రథంపై ఎమ్మెల్యే పక్కన ఉన్న గాండ్లపర్తి ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్

ఫీల్డ్ అసిస్టెంట్‌పై వేటు

శింగనమల, ఏప్రిల్ 3: మండలంలోని గురుగుంట్లలో వైసీపీ అభ్యర్థి వీరాంజనేయులు సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆకులేడు ఫీల్డ్ అసిస్టెంట్ గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో విచారణ చేపట్టి.. అతన్ని తొలగించినట్లు ఆర్వో శ్రీను వెన్నల, ఎంపీడీవో బి. వెంకటరమణ బుధవారం తెలిపారు. ఎవరైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే తమకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేయాలని సూచించారు.

ప్రచారంలో వలంటీరు

హిందూపురం, ఏప్రిల్ 3: రూరల్ మండలంలో బాలంపల్లి పంచాయతీలో బుధవారం నిర్వహించిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో ప్రచారంలో అశ్వత్థనారాయణ అనే గ్రామ వలంటీరు పాల్గొన్నాడు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక ప్రచారం చేస్తుండగా అశ్వత్థనారాయణ నాయకులవెంట వెళ్లి ఓట్లను అభ్యర్థించినట్లు తెలిసింది.



ప్రచారంలో పాల్గొన్న వలంటీరు అశ్వత్థనారాయణ

రాజీనామా చేయాల్సిందే..!

- వలంటీర్లపై ఒత్తిడి తెస్తున్న వైసీపీ
- ప్రచారంలో పాల్గొనాలని హుకుం
- అధికారంలోకి వస్తే మంచి భవిష్యత్తు అంటూ ఉచిత మాటలు
- తిరస్కరిస్తున్న కొంతమంది వలంటీర్లు



పెనుకొండ మండలంలో మూకుమ్మడి రాజీనామా చేస్తున్న వలంటీర్లు (ఫైల్)

హిందూపురం, ఏప్రిల్ 3: పెనుకొండలో మొన్న మూకుమ్మడిగా వలంటీర్లు రాజీనామా చేశారు. నిన్న గోరంట్లలో అదేబాట పట్టారు. వీరు ముసుగు తొలగించుకుని వైసీపీ ప్రచారాల్లో పాల్గొనాలన్నదే ధ్యేయం. రాజీనామాలు ఆమోదించక ముందే వైసీపీ సేవలో తరించేందుకు సిద్ధమవుతున్నారు. సామాజిక పింఛన్లు, వలంటీర్ల ద్వారా పంపిణీ చేయద్దంటూ ఎన్నికల సంఘం ఆదేశాలు ఇవ్వడంతో ఇక ఎందుకులే అని రాజీనామాలు చేస్తున్నారు. ఎక్కువచోట్ల అధికార పార్టీ నాయకులు.. వలంటీర్లపై ఒత్తిడి తెస్తున్నారు. హిందూపురం, పెనుకొండ నియోజకవర్గాల్లో వందమందికి పైగా వలంటీర్లు రాజీనామా చేసినట్లు తెలుస్తోంది.

వలంటీర్లపై ఒత్తిళ్లు

సంక్షేమ పథకాలను అర్హులకు అందించడంలో వారధిగా ఉన్న వలంటీర్లను ఎలాగైనా తమ పార్టీకి ఉపయోగించుకోవాలనే లక్ష్యంతో వైసీపీ నాయకులు ఉన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలు ఇవ్వడంతో చేసేదిలేక నాయకులు.. వలంటీర్లపై ఒత్తిడితెచ్చి రాజీనామాలు చేయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో కొన్నిచోట్ల సచివాలయ సిబ్బంది.. వలంటీర్లపై ఒత్తిడి తెస్తున్నారు. పరిగి మండలంలో ఓ ఎంఎల్‌ఓ.. వలంటీర్లు ప్రచారంలోకి రావాలని ఒత్తిడి చేస్తున్నాడు. రాజీనామా చేసి వస్తేనే భవిష్యత్తు ఉంటుందంటున్నారు. మరికొంతమంది వైసీపీ నాయకులు స్వార్థం కోసం వలంటీర్లపై ఒత్తిడి తెచ్చి రాజీనామా చేయాలని హుకుం జారీ చేస్తున్నట్లు తెలుస్తోంది. కొంతమంది తిరష్కరిస్తున్నట్లు తెలుస్తోంది. పదో తరగతి వరకు చదివిన వారిని ఒత్తిడి చేసి రాజీనామా చేయించారు. ఉన్నత విద్యాభ్యాసం చేసిన వారు అందుకు ఒప్పుకోవట్లేదు. భవిష్యత్తులో తమకు ఎలాంటి ఉద్యోగాలు రావనీ, దీంతో ఒత్తిడి తెచ్చినా రాజీనామా చేయమంటూ డిగ్రీ, ఆపై చదివిన వారు తెగేసి చెబుతున్నట్లు సమాచారం.

కొన్నిచోట్ల ససేమిరా..

పరిగి మండలంలో ఓ వలంటీరుకు పైస్థాయి అధికారి, నాయకులు ఫోన్‌చేసి రాజీనామాకు సిద్ధపడాలన్నారు. తాను ఉన్నత విద్యావంతుడిననీ, రాజీనామా చేస్తే భవిష్యత్తులో ఉద్యోగాలు రావని తిరస్కరించినట్లు తెలిసింది. హిందూపురం మండలంలోని వలంటీరును వైసీపీ నాయకులు పిలిపించి, రాజీనామా చేయాలని చెప్పగా.. సున్నితంగా తిరస్కరించారు. లేపాక్షి మండలంలో ఓ వైసీపీ నాయకుడు.. వలంటీర్లను ఇంటికి పిలిపించుకుని రాజీనామా చేయాలని బెదిరించారు. అయినా వారు ససేమిరా అంటూ వెళ్లిపోయారు. పెనుకొండ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వలంటీర్లు రాజీనామా చేయాలని నాయకులతో పాటు మండలస్థాయి అధికారులు ఒత్తిడి తెస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఏది ఏమైనా వలంటీర్లతో మూకుమ్మడి రాజీనామా చేయించి, పార్టీ కోసం ఉపయోగించుకోవాలన్న పన్నాగాన్ని అధికార పార్టీ అమలు చేస్తోంది.

ప్రచారంలో పాల్గొనాలంటూ...

'రాజీనామా చేసిన ప్రతి వలంటీరు వైసీపీ ప్రచారంలో పాల్గొనాలనీ, అంతేకాక మీ పరిధిలో ఉన్న ఓటర్లు అధిక శాతం మంది వైసీపీకి ఓటువేసేలా ప్రయత్నించాలనీ, అలా ఎక్కువ ఓట్లు వేయించిన వారి వివరాలు కౌంటింగ్ రోజు తెలుస్తుందనీ, వారికి ప్రోత్సాహక బహుమతులు కూడా ఇప్పించేందుకు ప్రయత్నిస్తామ'ని స్థానిక నాయకులు.. వలంటీర్లకు చెబుతున్నట్లు తెలిసింది. అధికారంలోకి వస్తే వలంటీర్లకు మంచి భవిష్యత్తు ఉంటుందనీ, వేతనం కూడా పెరుగుతుందని దీనిని దృష్టిలో పెట్టుకుని వైసీపీకి పనిచేయాలంటూ వలంటీర్లను రహస్యంగా పిలిపించుకుని రాజీనామాలకు ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని కొంతమంది వలంటీర్లే బహిరంగంగా చెప్పుకుంటున్నారు.

పైపులైన్లు కూడా వేయించలేని వైసీపీ: కేశవ్



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కేశవ్

ఉరవకొండ, ఏప్రిల్ 3: ఐదేళ్లలో వైసీపీ నాయకులు కనీసం పైప్‌లైన్లు కూడా వేయించలేక పోయారని, ఉరవకొండలో తాగు నీటి ఎద్దడికి మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డే కారణమని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ విమర్శించారు. పట్టణంలోని నెహ్రూనగర్, సీవీవీ నగర్‌లో బుధవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సైకిలు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉరవకొండలో అభివృద్ధి జరిగిందంటే అది టీడీపీ హయాంలోనే అన్నారు. చెరువులు నిర్మించింది, పైప్‌లైన్‌లు ఏర్పాటు చేసింది టీడీపీ పాలనలోనే అని పేర్కొన్నారు. వైసీపీ నాయకుల కు తాగునీటి పథకంపై అవగాహన లేకపోవడం ఇష్టమొచ్చినట్లు వ్యవహరించడం వలన 12రోజులకు ఒక్కసారి నీరు వస్తున్నాయన్నారు. పీఏబీఆర్ నుంచి ఉరవకొండకు 2011లో పైప్‌లైన్లు మంజూరు అయితే వైఎస్సార్ హయాంలో మంజూరు అయినట్లు విశ్వేశ్వరరెడ్డి చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఆయన చనిపోయిన రెండేళ్ల తర్వాత ఆయన ఆత్మ వచ్చి ఏమైనా సంతకం పెట్టింది అని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో కూటమి విజయం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయ్‌భాస్కర్, దేవినేని పురుషోత్తం, రేగాటి నాగరాజు, జనసేన నాయకుడు గౌతమ్, మాధవి, రమేష్, లాల్‌స్వామి, నరేష్, జగదీష్, వసంత్ పాల్గొన్నారు.

● ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తనయులు విక్రమ్‌సింహ, విజయ్‌సింహ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. విడపనకల్లు మండలంలోని వేల్పుమడుగు గ్రామంలో విజయ్‌సింహ, వజ్రకరూరు, బొడిసానిపల్లి, గంజికుంట గ్రామాలలో విక్రమ్‌సింహ ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

దళితవాడలో అమిలినేని సహపంక్తి భోజనం

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 3: కంబదూరు చెక్‌పోస్టు వద్ద ఉన్న దళితవాడలో దళిత మహిళలతో కలిసి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు సహపంక్తి భోజనం చేశారు. దళితవాడలోని ఓ దేవాలయం వద్ద బుధవారం సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. అంతకు ముందు మహిళలు గజమాలతో అమిలినేని సురేంద్రబాబును ఘనంగా సత్కరించారు. అనంతరం దళిత వాడలో ఇంటింటికి వెళ్లి ప్రచారాన్ని చేపట్టారు. సూపర్‌సిక్స్ పథకాలపై ప్రతి మహిళకు క్షుణ్ణంగా వివరించారు. దళిత వాడలో నెలకొన్న సమస్యలను అక్కడున్న మహిళలతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే దళిత వాడల రూపురేఖలు మారుస్తామన్నారు. కాలనీలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తామని తెలిపారు. చంద్రబాబు హయాంలోనే దళితుల సంక్షేమానికి పెద్దపీట వేశారని వివరించారు. కంబదూరు మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన 13 వైసీపీ కుటుంబాలు అమిలినేని సమక్షంలో టీడీపీలోకి చేరారు. తర్వాత అండేపల్లి, మంద, కుర్లపల్లి, మేలుకుంట, రాళ్లపల్లి, రాళ్ల అనంతపురం గ్రామాల్లో పెద్దఎత్తున ప్రచారాన్ని చేపట్టారు. ఈ గ్రామాల్లో అమిలినేని సురేంద్రబాబుకు అడుగడుగునా ఆదరణ లభించింది. కార్యక్రమంలో ఆయా గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



గజమాలతో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను సన్మానించిన గ్రామస్థులు



దళిత వాడలో దళితులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న అమిలినేని సురేంద్రబాబు

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుం దని అనంతపురం పార్లమెంటు ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అన్నారు. బుధవారం కంబదూరు మండలంలోని అండేపల్లి, మంద, కుర్లపల్లి, మేలకుంట గ్రామాలలో ఎన్నికల ప్రచారంలో భాగంగా వారు రోడ్‌షో నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకులు, గ్రామస్థులు, మహిళలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఎక్కువ మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారన్నారు. చెరువులకు నీరివ్వగలిగితే రైతులు మరింత కష్టపడి పంటలు పండించుకోగలుగుతారని అన్నారు. అందు కోసం టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సాగు, తాగునీటికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఎంపీ అభ్యర్థి అంబిక లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు చంద్రబాబునాయుడు చేతుల్లో వుందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రావాలన్నా, టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్త లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

దళిత ద్రోహి జగన్: కాలవ



కేపీకుంటలో కాలవకు హారతులిస్తున్న మహిళలు

రాయదుర్గం, ఏప్రిల్ 3: దళితుల పథకాలు 27 రద్దు చేసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దళిత ద్రోహిగా నిలిచాడని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ధ్వజమెత్తారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన దళితుల ఆత్మీయ కలయికలో ఆయన మాట్లాడారు. రూ. 33వేల కోట్ల సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించారన్నారు. టీడీపీ హయాంలో దళితులకు కేటాయించిన నిధుల్లో 90 శాతం ఖర్చు చేశామన్నారు. జగన్ హయాంలో 50 శాతం కూడా ఖర్చు చేయలేని పరిస్థితి అన్నారు. ఇటువంటి దళిత ద్రోహికి బుద్ధిచెప్పే సమయం ఆసన్నమైందన్నారు. అందరూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి తెలుగుదేశంను గెలిపించాలని అభ్యర్థించారు.

కేపీకుంటలో బ్రహ్మరథం

గుమ్మఘట్ట, ఏప్రిల్ 3: మండలంలోని కేపీకుంట గ్రామంలో బుధవారం టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులుకు ఆ ఊరి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మహిళలు హారతులతో కాలవ శ్రీనివాసులు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ మంజునాథగౌడకు స్వాగతం పలికారు. గ్రామానికి చెందిన టీడీపీ యువ నాయకుడు రాము గజమాలతో కాలవ శ్రీనివాసులును స్వాగతించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కాలవ మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలి, రాయదుర్గం నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే కాలవ శ్రీనివాసులును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గిరిమల్లప్ప, క్లస్టర్ ఇన్‌చార్జ్ కాలవ సన్నన్న, స్థానిక నాయకులు బుల్లెటి ఈరన్న, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, టీడీపీ నాయకులు, ఎస్సీ సెల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి: శ్రావణిశ్రీ



పార్టీలో చేరిన వారితో బండారు శ్రావణిశ్రీ

పుట్లూరు, ఏప్రిల్ 3: మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. మండలంలోని నారాయణపల్లి, వెంగన్నపల్లి, గోపురాజుపల్లి, బాలాపురం, పి. చింతలపల్లి గ్రామాల్లో బుధవారం ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో సుపరిపాలన రావాలంటే సైకిల్ గుర్తుకు ఓటువేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఐదేళ్లలో ప్రజలు పన్నుల భారంతో నరకయాతన అనుభవించారన్నారు. ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి మాట్లాడుతూ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుదర్శన్ నాయుడు, బాలరంగయ్య, చవ్వా కులశేఖర్‌రెడ్డి, డేగల కృష్ణమూర్తి, శివశంకర్‌రెడ్డి, జీసీ బాబు, రవిచంద్ర నాయుడు, పవన్‌కుమార్‌రెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

మండలంలోని బాలాపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు శ్రీరామిరెడ్డితోపాటు మరో 10కుటుంబాలు బుధవారం బండారు శ్రావణిశ్రీ సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో కన్వీనర్ బాలరంగయ్య, నాయకులు చవ్వా కులశేఖర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, రామచంద్రారెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఓబులనాయుడు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో విజయం సాధిస్తా: గుమ్మనూరు

గుంతకల్లు, ఏప్రిల్ 3: పార్టీలో అందరి సహకారంతో, బీజేపీ, జనసేన చేయూతతో విజయాన్ని సాధిస్తానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. బుధవారం ఉదయం పట్టణంలోని టీడీపీ ప్రముఖ నాయకుల ఇళ్లకు వెళ్లి ఎన్నికల్లో తనకు సహకరించాలని కోరారు. సత్యనారాయణ పేటలోని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గుమ్మనూరు వెంకటేశులు, పాతగుంతకల్లులో టీడీపీ పట్టణాధ్యక్షుడు బండారు ఆనంద్‌ను కలిసి మద్దతు కోరారు. ఎస్ఎన్ పేటలో ఏర్పాటుచేసిన సమావేశంలో జయరాం మాట్లాడుతూ గుంతకల్లు టీడీపీ నాయకుల్లో పార్టీ పట్ల కరుడుగట్టిన అభిమానాన్ని చూస్తున్నానన్నారు. పార్టీ ఏ అభ్యర్థికి టిక్కెట్టిచ్చినా పనిచేస్తామంటూ స్వచ్ఛందంగా వస్తున్నారని తెలియజేశారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు తాను ఎల్లప్పుడూ చేదోడుగా ఉంటానని పేర్కొన్నారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, కేసీ హరి, బీఎస్ క్రిష్ణారెడ్డి, పత్తి హిమబిందు, రామన్న చౌదరి, ఫ్రూట్ మస్తాన్, బండారు నగేశ్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



బండారు ఆనంద్‌ను కలిసిన గుమ్మనూరు జయరాం

విస్తృతంగా బాబు ష్యూరిటీ

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 3: పట్టణంలోని సీపీఐ కాలనీలో బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి హాజరై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి కావాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని తెలియజేశారు. సైకిల్ గుర్తుకు ఓటువేసి గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ కదిరి శ్రీకాంత్‌రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ నరేంద్రనాయుడు, నాయకులు హరినాథ్‌రెడ్డి, లోకనాథ్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, చింబిలి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండలంలోని ముప్పాలగుత్తి, మల్లేన్‌పల్లి గ్రామాల్లో బుధవారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి టీడీపీ ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. సైకిల్ గుర్తుకు ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఆయన వెంట జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కదిరి శ్రీకాంత్‌రెడ్డి, మండల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

ఇంటి నుంచి ఓటు వేయడంపై అవగాహన



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీవో రాణి సుష్మిత

కళ్యాణదుర్గం రూరల్, ఏప్రిల్ 3: ఇంటి నుంచి ఓటు వేసే ప్రక్రియపై ఏపీవో, పీవోలకు ఆర్డీవో రాణి సుష్మిత అవగాహన కల్పించారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గంలో ఉన్న ఏఈ, ఆర్‌వోలు, ఎన్నికల సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో రాణి సుష్మిత ఫారం 12డి, 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, పీడబ్ల్యూడీ ఓటర్లకు ఓటు వేసే విధానంపై పలు సలహాలు, సూచనలు అందించారు.

జోరుగా రేషన్ బియ్యం అక్రమ రవాణా

బొమ్మనహాళ్, ఏప్రిల్ 3: మండలంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా జోరందుకుంది. కర్ణాటకకు చెందిన ఒక ముఠా మండలంలో మకాం వేసి రేషన్ బియ్యాన్ని సేకరించి తరలిస్తోంది. కర్ణాటకు చెందిన సురేష్ అనే వ్యక్తి మండలంలోని కురవళ్లి, సిద్ధరాంపురం, చంద్రగిరి, నేమకల్లు, ఉంతకల్లు తదితర గ్రామాల నుండి రేషన్ బియ్యాన్ని రూ. 10లతో కిలో కొనుగోలు చేసి అక్రమ రవాణా సాగిస్తున్నారు. అధికారులకు మామూళ్లు ముట్టచెప్పి ఈ రవాణా సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ నుంచి కర్ణాటకలోని చెళ్లకెర, పావగడ, టుంకూరు ప్రాంతాలలో ఉన్న రైస్‌మిల్లులకు తరలించి ఒక కిలోకు రూ. 35 నుంచి రూ. 38ల వరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. అధికారులు రేషన్‌బియ్యం అక్రమ రవాణా జరగకుండా అరికట్టాల్సిన అవసరం ఉంది.

వైసీపీకి షాక్



పార్టీలో చేరుతున్న గ్యాస్ కృష్ణకు కండువా వేస్తున్న కాలవ

190 కుటుంబాలు టీడీపీలో చేరిక

రాయదుర్గం, ఏప్రిల్ 3: వైసీపీకి రాయదుర్గంలో షాక్ తగిలింది. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు కృష్ణకుమార్ ఆధ్వర్యంలో బుధవారం పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీలో చేరారు. వైసీపీకి చెందిన 190 కుటుంబాలు ఆయన నాయకత్వంలో టీడీపీలో చేరాయి. పట్టణంలోని చిందనూరు కల్యాణమంటపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వీరంతా మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు సమక్షంలో తెలుగుదేశంలో చేరారు. కాలవ వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. గ్రామదట్ల, గోనబావి, గలగల, శిరిగేదొడ్డి, బీటీపీ, కలుగోడు, రంగచేడు, భూపసముద్రం, నేత్రపల్లి, పులకుర్తి, బొమ్మక్కపల్లి, ఉడేగోళం, డీ కొండాపురం, వడ్రవన్నూరు, కొంతానపల్లి, రాయదుర్గంకు చెందిన దళిత కుటుంబాలు కృష్ణ నాయకత్వంలో పార్టీలో చేరారు. వైసీపీలో క్రియాశీలకంగా ఉన్న ఆయన చేరికతో మరింత బలం పెరిగిందని తెలుగుదేశంను గెలిపించుకోవడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు.

టీడీపీలోకి చేరిక

పెద్దవడుగూరు, ఏప్రిల్3: మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ మద్దతుదారులు బుధవారం తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని నమ్మి పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో రాంమోహన్, రవి, శ్రీనివాసులు, నారాయణస్వామి, చిన్నోడు, బాలి, ఈరన్న, కుళ్లాయప్ప, ధన, మహేశ్ తదితరులు ఉన్నారు.

తేనీటి విందుకు హాజరైన జేసీపీఆర్

తాడిపత్రిటౌన్: పట్టణంలోని సున్నపుగేరిలో ఉంటున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శింగరి లక్ష్మీనారాయణ ఇచ్చిన తేనీటివిందుకు మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన శింగరి కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ప్రచార వ్యూహాలపై కాసేపు చర్చించారు. అనంతరం సమీపంలో ఉన్న పంచముఖ ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించి స్వామివారికి పూజలు చేయించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు జగదీశ్వరరెడ్డి, హరినాథ్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ కదిరి శ్రీకాంత్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి హరీష్‌రెడ్డి, అంకాల్‌రెడ్డి, ఆంజనేయులు, రంగనాథరెడ్డి, గంగాధర్ ఉన్నారు.



పార్టీలో చేరిన వారితో జేసీ ప్రభాకర్‌రెడ్డి

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 3: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తు రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. గుమ్మఘట్ట మండలంలోని భూపసముద్రం, రంగచేడు, వేదావతి హగరి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా డిగ్రీ కళాశాల వద్ద వీటిని సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే డీ.హీరేహాళ్ మండలం హడగలి వద్ద సెబ్ అధికారులు రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకుని పట్టణంలో ఉన్న పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. రెండు ఇసుక టిప్పర్లకు ఓబుళాపురం రశీదులు ఉన్నట్లు తెలిపారు.

పింఛన్ల పంపిణీ వాయిదా

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 3: సామాజిక పింఛన్ల పంపిణీ వాయిదా పడింది. ప్రభుత్వం డబ్బులను బ్యాంక్‌లకు బుధవారం మధ్యాహ్నం జమ చేసింది. దీంతో సచివాలయ సిబ్బంది మధ్యాహ్నం 3గంటలకు డబ్బులను డ్రా చేసుకునేందుకు బ్యాంక్‌లకు వెళ్లారు. అక్కడ రద్దీ ఎక్కువగా ఉండటంతో డబ్బులను డ్రా చేసుకునేందుకు సాయంత్రం అయ్యింది. దీంతో సచివాలయ సిబ్బంది పింఛన్ల లబ్ధిదారులకు గురువారం ఉదయం నుంచి పంపిణీ చేస్తామని చెప్పారు. దివ్యాంగులు, తీవ్రఅనారోగ్యంతో ఉన్నవారికి, వితంతువులకు ఇంటివద్దే పింఛను సొమ్ము అందజేస్తామని సచివాలయ కార్యదర్శులు తెలిపారు.

ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పుట్లూరు, ఏప్రిల్ 3: సచివాలయ సిబ్బందే ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందించాలని టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని బాలాపురం గ్రామంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అధికారపార్టీ పింఛన్ల పంపిణీ నిలిపివేసి తమ పార్టీపై రుద్దడం దుర్మార్గపు చర్య అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో నిధులను తన కాంట్రాక్టర్లకు ఇచ్చుకుంటూ పింఛన్‌దారులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ముఖ్యమంత్రిపై ధ్వజమెత్తారు. వలంటీర్లతో వైసీపీ నాయకులే రాజీనామాలు చేయిస్తూ ఎన్నికల ప్రచారానికి వాడుకుంటున్నారన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు సుదర్శన్ నాయుడు, బాలరంగయ్య, కులశేఖర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పార్లమెంటు ఎన్నికల కమిటీ నియామకం

గుంతకల్లు, ఏప్రిల్ 3: ఎన్నికల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ముగ్గురు సభ్యులున్న టీడీపీ పార్లమెంటు ఎన్నికల కమిటీని ఏర్పాటు చేశారు. అనంతపురం పార్లమెంటరీ కమిటీకి జిల్లాకు చెందిన న్యాయవా దులు తిరుపతినాయుడు, బీఎస్ కృష్ణారెడ్డి, డీ శివశంకర్‌ను నియమించా రు.

కసాపురం ఆలయం వద్ద శిశువు జననం

గుంతకల్లుటౌన్,ఏప్రిల్3: కసాపురం సెట్టికంటి దేవాలయం కోనేటి వద్ద మంగళవారం రాత్రి ఓ యువతి ఆడశిశువుకు జన్మనిచ్చింది. పట్టణంలోని హనుమేష్ నగర్‌కు చెందిన యువతి గర్భవతి అయ్యింది. ఉదయం డెలివరీ కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లగా తల్లిదండ్రులను తీసుకురావాలని వైద్యులు తెలిపారు. దీంతో ఆ యువతి విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పకుండా రాత్రి కసాపురం దేవాలయంకు వెళ్లింది. అక్కడ పురిటి నొప్పులు రావడంతో ఆ యువతి కోనేటి వద్ద ఆడశిశువుకు జన్మనిచ్చింది. శిశువు కేకలు విన్న స్థానికులు 108వాహనం, కసాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువతి, శిశువును గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బుధవారం సమాచారం అందుకున్న ఐసీడీఎస్ సీడీపీఓ డిల్లీశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సవాలయ సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. యువతిని విచారించారు. సంరక్షణ బాధ్యత కష్టమని చెప్పడంతో శిశువును అనంతపురంలోని శిశుగృహానికి తరలించినట్లు సీడీపీఓ తెలిపారు.

టీడీపీలోకి చేరిక

ఉరవకొండ,ఏప్రిల్ 3: పట్టణానికి చెందిన శాలివాహన కులస్థులు బుధవారం పయ్యావుల శ్రీనివాసులు సమక్షంలో టీడీపీలో చేరారు. వైసీపీకి చెందిన రవి, యుగంధర్, రాజశేఖర్, గాదిలింగ, నాగరాజు టీడీపీలో చేరిన వారిలో ఉన్నారు. వారికి పయ్యావుల శ్రీనివాసులు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధనుంజయ పాల్గొన్నారు.

మహిళల పట్ల ఆకతాయి అసభ్య ప్రవర్తన

పామిడి, ఏప్రిల్ 3: మహిళల పట్ల ఓ యువకుడు కొద్ది రోజులుగా అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల సమాచారం మేరకు.. పట్టణంలోని గుప్తా కాలనీ శివారు ప్రాంతంలోని కంపచెట్లలో ఓ యువకుడు గత కొద్ది రోజులుగా పొంచి ఉంటూ అటుగా నడుచుకుంటూ వెళ్లే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. పాఠశాలల నుంచి పిల్లలను ఇంటికి తీసుకువెళ్లే సమయంలో ఆ యువకుడు ఆ మహిళల పట్ల దురుసుగా ప్రవర్తించేవాడు. ఆ ఆకతాయి చేష్టలకు విసుగుచెందిన మహిళలు బుధవారం అంతా కలిసి వెళ్లి పట్టుకునే ప్రయత్నం చేశారు. కానీ అతడు తప్పించుకొని పారిపోయాడు. దీంతో మహిళలు ఆగ్రహంతో అక్కడే ఉన్న ద్విచక్ర వాహనాన్ని కాలువలో పడేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి వచ్చి ఆ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ద్విచక్ర వాహనం యజమానిని పోలీసులు విచారించారు. ద్విచక్రవాహనంలో పెట్రోలు అయిపోవడంతో తెచ్చేందుకు బండిని అక్కడే ఉంచి వెళ్లినట్లు అయన తెలిపాడు. రికార్డులు చూపించాడు. పోలీసులు మహిళలను విచారించగా వేధిస్తున్న ఆకతాయి అతడు కాదని తెలిపారు. దీంతో ఆ ద్విచక్రవాహనం అతడికి అందజేసినట్లు సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

చీనీతోటల్లో తెగుళ్లపై అవగాహన

పెద్దపప్పూరు, ఏప్రిల్3: మండలంలోని నామనాంకపల్లి గ్రామంలో బుధవారం ఉద్యాన శాఖ అధికారులు చీనీతోటలకు వ్యాపించే తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. తెగులు సోకిన పంటకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల అధికారులమని చెప్పి ఉంగరం కాజేశారు

యాడికి, ఏప్రిల్ 3: ఎలక్షన్ అధికారులమని చెప్పి వెంకటసుబ్బయ్య అనే వృద్ధుని నుంచి ఇద్దరు దుండగులు బంగారు ఉంగరం కాజేసిన సంఘటన బుధవారం రాయలచెరువు వద్ద జరిగింది. పచ్చారు మేకలపల్లికి చెందిన బాధితుడు బుధవారం మధ్యాహ్నం కూర్మాజీపేటలోని తన పొలం వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా రాయలచెరువులోని రైల్వేగేట్ వద్ద గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు వచ్చి తాము ఎలక్షన్ అధికారులమని చెప్పారని తెలిపారు. ఎన్నికల సమయంలో బంగారు ఉంగరాలు అన్ని ఇలా చేతులకు పెట్టుకోకూడదని చెప్పారు. వెంకటసుబ్బయ్య చేతికి ఉన్న బంగారు ఉంగరం, బ్యాంక్ పాసుపుస్తకం, సెల్‌ఫోన్ తీసుకొని ద్విచక్ర వాహనం బ్యాగులో పెడతామని తీసుకున్నారు. బ్యాంక్ పాసుపుస్తకం, సెల్‌ఫోన్ బ్యాగులో పెట్టి బంగారు ఉంగరం తీసుకొని పారి పోయారని వాపోయాడు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నీటి టబ్‌లో పడి చిన్నారి మృతి

పెద్దవడుగూరు, ఏప్రిల్3: మండలంలోని చింతలచెరువు గ్రామంలో నీటి టబ్‌లో పడి 13 నెలల చిన్నారి అఖిల్ బుధవారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు చింతలచెరువు గ్రామానికి చెందిన రాధ, శివ దంపతులకు కుమార్తెతోపాటు కుమారుడు అఖిల్ ఉన్నాడు. ఇరువురు వ్యవసాయ పనులకు వెళుతూ జీవనం సాగించేవారు. బుధవారం చిన్నారి అఖిల్ ఇంటిలో నుంచి బయటకు వచ్చి ఆవరణలో ఆడుకుంటుండగా నీటిటబ్‌లో పడిపోయాడు. కొద్దిసేపటి తర్వాత ఇంటినుంచి బయటకు వచ్చిన తల్లి రాధ చిన్నారి అఖిల్‌ను వెదికింది. బాలుడు టబ్‌లో అపస్మారక స్థితిలో పడి ఉండటం చూసి హుటాహుటిన పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు తెలిపారు. చిన్నారి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

అభివృద్ధి పనులు చేయలేక అసత్యప్రచారాలా ?: టీడీపీ

యాడికి, ఏప్రిల్3: వైసీపీ నాయకులు అభివృద్ధి పనులు చేయలేక పింఛన్ల పంపిణీపై అసత్య ప్రచారాలు చేయడం తగదని మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, తెలుగుయువత జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పరిమి చరణ్ హితవు పలికారు. రాయలచెరువులో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పింఛన్ల పంపిణీపై వైసీపీ నాయకులు అసత్యప్రచారాలు చేయడం తగదన్నారు. అభివృద్ధి పనులు చేయలేక టీడీపీపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. జగన్ రాకపోతే పింఛన్లు రావని వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రచారం చేయడం తగదన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు పింఛన్లను సచివాలయాల అధికారులు పంపిణీ చేస్తారన్నారు. సచివాలయాల వద్దకు వెళ్లలేని వారికి అధికారులు ఇళ్లవద్దకే వచ్చి పంపిణీ చేస్తారని తెలిపారు. సమావేశంలో మాజీ సర్పంచు గోపాల్‌నాయుడు, రజక శేఖర్, హుసేన్‌వలి, రంగనాథ్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

టీడీపీ ఇంటింటి ప్రచారం



పొబ్బర్లపల్లిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

బ్రహ్మసముద్రం, ఏప్రిల్ 3: మండలంలోని కప్పటనింగనహళ్లి, భైరవానితిప్ప, పొబ్బర్లపల్లి గ్రామాలలో బుధవారం టీడీపీ కన్వీనర్ శ్రీరాములు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తూ ఓటర్లను సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు కుటుంబ సభ్యులు రాహుల్ అభ్యర్థించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్ నాగరాజు, టీడీపీ నాయకులు విరుపాక్షి గౌడ, మల్లికార్జున, యర్రిస్వామి, కార్యకర్తలు పాల్గొన్నారు.